# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**నవంబర్ 20, 2012**

# పీడిత ప్రజల ముద్దుబిడ్డ, సాహసిక పట్టణ గెరిల్లా

# కామ్రేడ్ కనకస్వామికి అరుణాంజలి!

పీడిత, తాడిత ప్రజల ఉత్తమ పుత్రుడు కామ్రేడ్ కనకస్వామి (బాబ్జీ, అమన్) 24-9-2012న మలేరియాతో అమరుడైనాడని తెలియజేయడానికి విచారిస్తున్నాం. 28 ఏళ్ల విప్లవోద్యమానికి ఎనలేని కృషి చేసిన కామ్రేడ్ అమన్‌ను కోల్పోవడం పార్టీకి, విప్లవోద్యమానికి పెద్ద నష్టం. ఉద్యమంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆ కామ్రేడ్‌ను కోల్పోవడం మాకు తీవ్ర బాధను, దు:ఖాన్ని కల్గించింది. అమరునికి తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం. అమరుని ఆశయాన్ని తుదికంటా కొనసాగిస్తామని ప్రతిన బూనుదాం. నిత్య నిర్బంధం మధ్య ఈ వార్తను ఆలస్యంగా బాహ్య ప్రపంచానికి తెలియజేస్తున్నందుకు మేం విచారిస్తున్నాం. ఈ వార్త కనకస్వామి కుటుంబ సభ్యులకు తీవ్రమైన దు:ఖం కలుగుతుంది. వారి బాధలో, దుఃఖంలో మా పార్టీ భాగం పంచుకుంటున్నది. ఈ సందర్భంగా మా పార్టీ కనకస్వామి అన్నా, వదినలకు, బంధు-మిత్రులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

మన అందరి ప్రియమైన నాయకుడు, పీడిత ప్రజల ప్రేమాభిమానాలను పొందిన నాయకుడు కామ్రేడ్ కనక స్వామి (బాబ్జీ) 1969లో వరంగల్ జిల్లా మద్దూరు మండలం కూటిగల్ గ్రామంలోని ఒక పేదరైతు కుటుంబంలో పుట్టారు. 1984లో విప్లవోద్యమంలో భాగస్వామి అయి అమరుడయ్యే నాటి వరకు ఎన్నెన్నో బాధ్యతలు నిర్వహించారు. 1984 మధ్య నుండి 1985 మధ్య వరకు నర్సంపేట సెంట్రల్ ఆర్గనైజర్ (అమరుడు పైండ్ల వెంకట రమణ, కడవెండి)కి గార్డుగా బాధ్యతలు నిర్వహించారు. వరంగల్ జిల్లాలో దూల్మిట్ట, బెక్కల్, కూటిగల్, బైరాన్‌పల్లి తదితర గ్రామాల భూపోరాటాలు, కూలి పోరాటాలలో భాగం పంచుకున్నారు. 1985 తర్వాత వరంగల్ జిల్లా సెక్రటరీ కామ్రేడ్ పులి అంజన్న (అమరుడు)కి కొరియర్‌గా ఎలాంటి శషభిషలకు తావు లేకుండా అత్యంత కీలకమైన బాధ్యతలు చేపట్టి శత్రు మూకల కళ్లు గప్పి జిల్లాకి, రాష్ట్ర కమిటీకి మధ్య వార్తాహరుడుగా పనిచేశారు. 1993లో హైద్రాబాద్‌లో డిఐజి కెఎస్ వ్యాస్ యాక్షన్‌లో అత్యంత సాహసోపేతంగా పాల్గొన్నారు. 1995 నుండి 2007 వరకు పార్టీ సెంట్రల్ టెక్నికల్ రంగంలో అనేక రాష్ట్రాలలో రహస్యంగా ఉంటూ గెరిల్లా దళాలకు ఆయుధాలు, గ్రెనేడ్లు తయారు చేసి అందించే బాధ్యతలు చేపట్టారు. తన టీము సభ్యులతో ఎంతో శ్రమకోర్చి వేలాది గ్రెనేడ్స్, వందలాది ఆయుధాలు అందించడంలో ముందున్నారు. వాటిని తనే స్వయంగా నల్లమల, దక్షిణ తెలంగాణ ప్రాంతాలకు చేర్చేవారు. టెక్నికల్ రంగంలో పట్టణాల్లో రహస్యంగా ఉంటూ పనిచేస్తున్న క్రమంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటన్నింటినీ నిబ్బరంగా ఎదుర్కొంటూ ఒక మంచి టెక్నీషియన్‌గా ఎదిగారు. విప్లవోద్యమానికి అవసరం అయిన ఆయుధ సామాగ్రిని తయారు చేసి అందించడంలో అహర్నిశలూ పనిచేస్తూ తన వంతు బాధ్యతను నిర్వహించారు. అదే క్రమంలో అనారోగ్యానికి గురైనారు. స్పాండిలైటిస్, నడుము నొప్పి బాధలు భరిస్తూనే తన బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో శత్రు చేత చిక్కినప్పుడు శతృవు పెట్టిన తీవ్ర చిత్రహింసలకు ఆరోగ్యం మరింత దెబ్బతింది. 2007 ప్రారంభంలో ఒడిషా రాష్ట్రంలోని రూర్కెలా పట్టణంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో పోలీసు మూకలు మా పార్టీ టెక్నికల్ విభాగపు టీము మీద చేసిన దాడిలో కామ్రేడ్ కనకస్వామిని కూడా అదుపులోకి తీసుకున్నారు. చెప్పనలవికాని విధంగా చిత్రహింసలు పెట్టారు. అయినా మొక్కవోని ధైర్యంతో పార్టీ రహస్యాలను ఆయన కాపాడారు. ఇది విప్లవకారులందరికీ ఆదర్శం. దాదాపు 3 సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. జైలులోని అక్రమాలకు, అక్కడ సాగుతున్న అణచివేత పద్ధతులకు, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం నడిపించడంలో కూడ తన వంతు పాత్రను నిర్వహించారు. బెయిల్‌పై విడుదలై ఎలాంటి ఊగిసలాట లేకుండా నేరుగా దండకారణ్య విప్లవోద్యమంలో చేరిపోయారు. అక్కడ 2009 మధ్య భాగం నుండి 2012 సెప్టెంబర్ వరకు అంటే మూడు సం॥లు టెక్నికల్ విభాగంలో ఆయుధాల తయారీలో క్రియాశీలంగా పాల్గొన్నారు. తాను ఎందరో కార్యకర్తలకు తనకు తెల్సిన టెక్నికల్ స్కిల్స్ నేర్పేవారు.

దండకారణ్యంలో పనిచేస్తున్న క్రమంలో తనకు బ్లడ్ ప్రెషర్ సమస్య తోడయింది. అలాగే మలేరియా రావడం ఇక్కడ అందరికి సర్వసాధారణమైందే. మలేరియాతో పోరాడుతూనే దండకారణ్య పరిస్థితులకు అలవాటు పడి పనిచేయసాగారు. అయితే ఊహించని విధంగా మలేరియా జ్వరంతోనే కామ్రేడ్ కనకస్వామి అంతిమశ్వాస విడిచారు. దండకారణ్యంలో మలేరియాతో ప్రాణాలు కోల్పోయింది (పార్టీలో, పిఎల్‌జిఏలో) అతి కొద్దిమంది కామ్రేడ్సే. వారిలో కనకస్వామి ఒకరు (4వ కామ్రేడ్). సెప్టెంబర్ 24 ఉదయం 8 గంటల వరకు తాను తన సహచరులతో మాట్లాడుతూనే ఉన్నారు. తర్వాత ఊపిరి సమస్య తీవ్రమై 10 గంటలకు ప్రాణాలు కోల్పోయారు. కామ్రేడ్ కనకస్వామిని కాపాడుకోలేనందుకు దగ్గరే వున్న తన జీవిత భాగస్వామికి, పార్టీ, పిఎల్‌జిఏ నాయకత్వానికి, కేడర్లకూ తీవ్రమైన బాధ, దు:ఖమే మిగిలింది.

దండకారణ్యంలో ఆదివాసీ భాషను నేర్చుకుంటూ వారి ప్రేమాభిమానాలు పొందిన నాయకుడు కామ్రేడ్ అమన్ (బాబ్జీ, కనకస్వామి).

విప్లవ జీవితంలో అడుగు పెట్టిన తర్వాత ఏనాడూ వెనుదిరిగిచూడలేదు. శత్రువుకు తలవంచలేదు. తను ఎంతగానో ప్రేమించే కామ్రేడ్ పులి అంజన్న, కామ్రేడ్ సంతోష్ రెడ్డి, కామ్రేడ్ దామోదర్ రెడ్డి లాంటి వాళ్లు అమరులైనా, వారి ఆశయ సాధన కోసం అహర్నిశలా శ్రమించిన విప్లవ వీరుడు. ఎంతటి నిర్బంధంలోనైనా నిబ్బరంగా ఉంటూ శత్రు మూకల ముందే తిరుగాడుతూ తన బాధ్యతలను సునాయాసంగా నిర్వహించే నేర్పరి. నేర్చుకోవడంలో, నేర్పించడంలో ఎంతో శ్రద్ధ కనపర్చేవారు. తనకు ఎంత అనారోగ్యం ఉన్నా బాధ్యతలకు ఆటంకం కాకుండా చూసుకోవాలనే విప్లవ స్ఫూర్తిని ప్రదర్శించేవారు. విప్లవ రాజకీయాలను లోతుగా అధ్యయనం చేస్తూ, విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడంలో శక్తిమేరకు కృషిసల్పారు.

భారత దోపిడి పాలకవర్గాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని ఉక్కుపాదాలతో తొక్కివేసే లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై యుద్ధాన్ని సాగిస్తున్నాయి. పార్టీకి, పిఎల్‌జిఏలకు సప్లైలు రాకుండా అడ్డుకుంటూ మందులు, వైద్యం అందకుండా చేస్తున్నాయి. దాడులు చేసి చంపడమే కాకుండా అనేక రకాలుగా పార్టీని, గెరిల్లాలను చంపాలని కుట్రలు చేస్తున్నాయి. సెప్టెంబర్ 18న గడ్‌చిరోలి డివిజన్‌లోని మానెవార అనే గ్రామంలో శత్రువు ఆహారంలో విషం కలపడంతో 21 మంది పిఎల్‌జిఏ యోధులు, 5గురు గ్రామస్థులు చావు అంచులోకి వెళ్లి బతికి బయటపడ్డారు. ఇది మన కామ్రేడ్ కనకస్వామి అనారోగ్యంతో ఉన్న క్రమంలోనే జరిగింది. ఇలాంటి స్థితిలో శత్రు కుట్రలను అర్థం చేసుకుంటూ అనారోగ్యాన్ని లెక్కచేయకుండా అంతిమ శ్వాస వరకు పట్టుదలతో పనిచేసిన మన కామ్రేడ్ కనకస్వామి మనందరికీ ఆదర్శం. కామ్రేడ్ కనకస్వామి అంత్యక్రియలు పార్టీ, పిఎల్‌జిఏ కేడర్ల, విప్లవ ప్రజల సమక్షంలో విప్లవ సాంప్రదాయలతో జరిగాయి. అతని అంకిత భావం, దృఢత్వం నుంచి నేర్చుకుంటూ విప్లవ పథంలో తుది పోరాదుతామని ఆయని ఆశయాలను, ఆదర్శాలను, విప్లవ విలువలను, ఎత్తిపడుతూ ముందుకు తీసుకపోతామని ప్రతిజ్ఞ చేద్దాం. కామ్రేడ్ కనకస్వామి వంటి వేలాది అమరులు కలగన్న దోపిడీపీడనలకు తావు లేని సమసమాజాన్ని నిర్మించడానికి ముందుకు రావల్సిందిగా మేం దేశ పీడిత ప్రజలందరికీ, యువతరానికీ పిలుపునిస్తున్నాం.

**రామన్న**

**కార్యదర్శి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**